

మానసిక వ్యాధులపై అవగాహన

సదాశివనగర్, మే6: సదాశివనగర్ పీహెచ్‌సీలో మానసిక వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ప్రతినెల రెండో సోమవారం పీహెచ్‌సీలో మానసిక ఆరోగ్యనిపుణులు డాక్టర్ రమణ మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి చికిత్సలు నిర్వహిస్తారని వైద్యాధికారిని ఆస్మా తెలిపారు. మానసిక ఆరోగ్యంతో ఉన్నవారికి చికిత్స అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగరాజు, సూపర్‌వైజర్ లీలావతి, ఫార్మాసిస్ట్ ప్రణయ్, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

- జిల్లాలో ప్రచారంతో హోరెత్తిస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు
- నేడు కామారెడ్డిలో కేసీఆర్ బస్సుయాత్ర, కార్నర్ మీటింగ్
- 10న ప్రియాంక గాంధీ బహిరంగ సభ
- ఇప్పటికే గ్రామాలను చుట్టేసిన ఆయా పార్టీల నేతలు
- రాజుకున్న రాయకీయ వేడి
- అగ్రనేతలు, పార్టీ అధినేతల ప్రచార సభలకు పోటాపోటీగా ఏర్పాటు చేస్తున్న నేతలు
- తమదే గెలుపనే ధీమాతో ఆయా పార్టీల అభ్యర్థుల ప్రచారం



ప్రధాన పార్టీల దూకుడు!

కామారెడ్డి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల గడువు సమీపిస్తున్న కొద్దీ ప్రధాన పార్టీలు ప్రచారంలో మరింత దూకుడును పెంచాయి. ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు గ్రామాలను మండలాలను చుట్టేస్తున్నారు. గెలిస్తే చేయబోయే అభివృద్ధిని వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. మరోవైపు అభ్యర్థులు, నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతివిమర్శలు చేస్తూ రంజుగా రాజకీయం నెలకొంటుంది. పనిలో పనిగా ప్రచారానికి అగ్రనేతలను, పార్టీ అధినేతలను రంగంలోకి దింపుతుండడంతో రాజకీయం మరింత వేడెక్కనుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లు పోటాపోటీగా ఇప్పటికే ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో, గ్రామాల్లో ప్రచారం చేపడుతున్నారు. ఓవైపు ఎండలు దంచికొడుతున్న గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు,నాయకులు ఇంటింటా వెళ్తు ఓట్లను అభ్యర్థిస్తున్నారు.

ప్రచారంలోకి ప్రముఖులు

ఎన్నికలకు మరో వారం రోజులే గడువు ఉండడంతో ఓటర్లను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఇప్పటికే జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో పలువురు స్టార్ క్యాంపెయినర్‌లతో ఆయా ప్రధాన పార్టీల తరఫున ప్రచారం నిర్వహించారు. కామారెడ్డి జిల్లాలోనూ ప్రచార రంగంలోకి అభ్యర్థులు ప్రముఖులను దింపుతున్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లాకేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్ పర్యటించనున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరఫున కామారెడ్డిలో కేసీఆర్ బస్సుయాత్ర, కార్నర్‌మీటింగ్ ఏర్పాటు చేయనున్నారు. కామారెడ్డి బస్టాండ్ నుంచి మొదలుకొని జేపీఎన్‌చౌరస్తా వరకు కేసీఆర్ బస్సుయాత్ర నిర్వహించనున్నారు. అనంతరం జేపీఎన్ చౌరస్తాలో కార్నర్‌మీటింగ్‌లో కేసీఆర్ ప్రసంగిస్తారు. ఈనెల 10న కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో కాంగ్రెస్ అధినేత ప్రియాంకగాంధి, సీఎం రేవంత్‌రెడ్డిల బహిరంగసభను ఏర్పాటుచేయనున్నారు. అదేవిధంగా బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ తరఫున పలువురు కేంద్రమంత్రులు ప్రచారం చేసేందుకు రానున్నట్లు తెలుస్తోంది.

గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రచారం

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలకు ఈ పార్లమెంట్ ఎన్నికలు సవాల్‌గా మారాయి. తమ పార్టీ అభ్యర్థి ఎక్కువ ఓట్లు తీసుకురావడం ద్వారా పలుకుబడి పెంచుకోవాలని ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, నేతలు తహతహలాడుతున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ విస్తృతంగా పర్యటిస్తున్నారు. కాంగ్రెస్‌అభ్యర్థికి మెజార్టీ తీసుకురావాలనే లక్ష్యంతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. నియోజకవర్గంలోని అన్నిమండలాల్లో పార్టీశ్రేణులతో సమావేశం నిర్వహించి వారిని ఎన్నికలకు సన్నద్ధం చేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సైతం నియోజకవర్గం అంతటా చుట్టేస్తున్నారు. బైక్ ర్యాలీలతో నియోజకవర్గంలోని మండలాల్లో,గ్రామాల్లో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు సైతం విస్తృతంగా పర్యటిస్తూ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకోసం పాటుపడుతున్నారు. బాన్సువాడలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు మెజార్టీ తీసుకురావడానికి ప్రయత్నాలుచేస్తున్నారు.

హ్యాట్రిక్ విజయం కోసం ప్రయత్నాలు



మూడోసారి గెలుపే లక్ష్యంగా ఎంపీ బీబీపాటిల్ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. గతంలో బీఆర్‌ఎస్ తరఫున రెండు పర్యాయాలుగా ఎంపీగా గెలుపొందిన పాటిల్ ఈసారి బీజేపీ నుంచి బరిలోదిగారు. ఇప్పటికే జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభతో తన గెలుపు ఖాయమనే విశ్వాసంతో మరింత దూకుడు పెంచారు. జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల కదనరంగంలో నూతన ఉత్సహంతో క్యాడర్ ముందుకు సాగుతుంది. కామారెడ్డిలో కేసీఆర్, రేవంత్‌రెడ్డిలాంటి ప్రముఖులను ఓడించిన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి నాయకత్వంలో పార్టీశ్రేణులు జోష్‌తో ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎంపీ బీబీపాటిల్ నియోజకవర్గాన్ని మొత్తం చుట్టేస్తుండగా కామారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం సాగుతోంది. ఎల్లారెడ్డిలో పార్టీ నేతలు బాణాల లక్ష్మారెడ్డి, పైడి ఎల్లారెడ్డి అనుచరులు ప్రచారంలో పాల్గొంటున్నారు. బాన్సువాడలో మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో, జుక్కల్‌లో మాజీ ఎమ్మెల్యే అరుణతార, గంగారాం తదితరుల ఆధ్వర్యంలో ప్రచారం కొనసాగుతుంది.

పట్టు నిలుపునేందుకు బీఆర్‌ఎస్ ఆరాటం

రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచి జిల్లాపై పట్టునిలుపుకోవాలని ఆ పార్టీ ఆరాటపడుతోంది. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ బాన్సువాడలో విజయం సాధించగా జుక్కల్‌లో స్వల్పఓట్ల తేడాతో ఓటమిచెందింది. కామారెడ్డిలో అప్పటి సీఎం కేసీఆర్ బరిలో ఉండి ఓడిపోయారు. ఎల్లారెడ్డిలో బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పలేదు. అయితే తెలంగాణ ఆవిర్భావించిన తర్వాత వరుసగా రెండుసార్లు జహీరాబాద్ లోక్‌సభ స్థానాన్ని గెలుచుకున్న బీఆర్‌ఎస్ ఈసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని ప్రయత్నిస్తోంది. అధికార పార్టీపై వ్యతిరేకత మొదలైందని అది తమకు అనుకులిస్తుందని బీఆర్‌ఎస్ నేతలు ఆశిస్తున్నారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్‌లో మాజీ ఎమ్మెల్యేలు గంపగోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ షిండేలు అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరఫున ప్రచారం చేస్తున్నారు.

నేడు కామారెడ్డిలో.. కేసీఆర్ బస్సుయాత్ర

- జేపీయన్ చౌరస్తాలో కార్నర్‌మీటింగ్
- బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలిఅనిల్‌కుమార్ తరఫున ప్రచారం చేయనున్న కేసీఆర్
- ఏర్పాట్లు పూర్తి చేసిన బీఆర్‌ఎస్ శ్రేణులు



కామారెడ్డి, మే 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరఫున కామారెడ్డిలో మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మంగళవారం పర్యటించనున్నారు. కామారెడ్డిలో కేసీఆర్ బస్సుయాత్రతోపాటు కార్నర్ మీటింగ్ నిర్వహించేందుకు ఆ పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 5 గంటలకు మాజీ సీఎం కేసీఆర్ నిజాంసాగర్ చౌరస్తాకు చేరుకుంటారు. అక్కడి నుంచి బస్సుయాత్రతో భారీ ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తా, ప్రభుత్వ ఆసుపత్రి, ఇందిరా గాంధీచౌరస్తా, పొట్టి శ్రీరాములు చౌరస్తా, మాయాబజార్ మీదుగా జేపీఎన్ చౌరస్తాకు బస్సుయాత్ర చేరుకుంటుంది. అక్కడ కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ అభ్యర్థి తరఫున ప్రచారం నిర్వహించి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించను న్నారు. ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దిన్ పర్యవేక్షిస్తున్నాడు. కేసీఆర్ బస్సుయాత్ర, కార్నర్‌మీటింగ్‌కు కామారెడ్డి నియోజకవర్గం నుంచే కాకుండా ఎల్లారెడ్డి, బాన్సువాడ నుంచి జనాన్ని సమీకరించేందుకు నాయకులు చర్యలు తీసుకుంటున్నారు. కేసీఆర్ బస్సుయాత్రకు పెద్దఎత్తున జనం హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ కోరారు.



రేపటిలోగా ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, మే 6: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఈనెల 8లోగా వినియోగించుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులలో ఉండి ఫారం-12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఉద్యోగి తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని జిల్లాలోని శాఖాధికారులకు సూచించారు. ఉద్యోగులకు కూడా ఎన్నికల సంఘం నుండి వారి సెల్‌ఫోన్‌కు వచ్చిన సందేశం ఆధారంగ ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగుల కోసం ఎన్నికల సంఘం 8వరకు కొనసాగిస్తున్న పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కచ్చితంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం క్లోజ్ అయిన తర్వాత పోస్టల్ బ్యాలెట్ వేయడానికి అవకాశముండదని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నందున ఈనెల 13 న పోలింగ్ కేంద్రాలకు నేరుగా వెళ్లి ఓటువేయడానికి అవకాశం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కామారెడ్డిలో 2167,జుక్కల్‌లో 1081, ఎల్లారెడ్డిలో 1298 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

• బూత్‌స్థాయి అధికారి ద్వారా ఓటర్‌స్లిప్పుల పంపిణీ

ఈనెల 13న నిర్వహించే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓటరు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఓటర్ స్లిప్పులను సంబంధిత బూత్‌స్థాయి అధికారుల ద్వారా పంపిణీ చేశామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్లిప్పులో ఓటరు ఏ పోలింగ్ స్టేషన్ నంబర్‌లో ఉన్నారు. లోకేషన్, క్రమసంఖ్య, పోలింగ్ తేదీ, సమయం వివరాలు స్పష్టంగా ఉంటాయని తెలిపారు. ఓటరు స్లిప్పులతోపాటు ఓటరు గైడ్, సీ-విజిల్ కరపత్రాన్ని ప్రతీ ఇంటికి అందజేశామని, ఎన్నికల ఉల్లంఘనులకు సంబంధించి ఏదైన సమాచారం,ఫిర్యాదును ఈ యాప్‌ద్వారా చేయవచ్చని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును నిష్పక్షపాతంగా, స్వచ్ఛందంగా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలని కోరారు. స్వేచ్ఛగా నిర్భయంగా ఓటువేసేందుకు, జిల్లా యంత్రాంగం తగు ఏర్పాట్లు చేస్తున్నదని సెలవు అని పోలింగ్ రోజు ఎక్కడికి వెళ్లకుండా బాధ్యతగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని, ప్రధానంగా నూతన ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకుని తొలి అనుభూతి పొందాలని కోరారు. 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైన ఒకదాన్ని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లాలని తెలిపారు. పోలింగ్ సమయాన్ని గంట పొడిగించిందని తెలిపారు.

భానుడి భగభగ!



- జిల్లాలో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు

కామారెడ్డి టౌన్, మే 6: జిల్లాలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఎండ తీవ్రత తగ్గడంలేదు. వారం రోజుల వరకు 45డిగ్రీల లోపు నమోదైన ఉష్ణోగ్రతలు ప్రస్తుతం 45డిగ్రీలకు పైగానే నమోదవుతున్నాయి. పాల్వంచ మండలం ఎల్పుగొండలో 45.8, రామారెడ్డి 45.6, బాన్సువాడ మండలం కొల్లూర్‌లో 45.4, సదాశివనగర్ 45.3,బిచ్కుంద 44.8,పిట్లం 44.7, హసన్‌పల్లి 44.7, దోమకొండ 44.5, ముక్దుంపూర్ 44.1, మాచాపూర్ 44.0, పాతరాజంపేట 44, భిక్కనూర్ 44.0,సోమూర్ 43.8,గాంధారి 43.7, ఆర్గొండ 43.7, తాడ్వాయి 43.7, జుక్కల్ 43.4, లింగంపేట 43.1, మేనూర్ 43.1, బీర్కూర్ 43, పెద్దకొడప్గల్ 43.0, బొమ్మన్‌దేవాయిపల్లి 42.9, నాగిరెడ్డిపేట 42.8, నస్రూళ్లబాద్ 42.6, ఇసాయిపేట 42.4, బీబీపేట 42.4, డొంగ్లి 42, రామలక్ష్మన్‌పల్లి 42, పుల్కల్41.8, కామారెడ్డి 41.2గా నమోదయ్యాయి.

పంట నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం ఇస్తాం

- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ



మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గ్యార లక్ష్మీ సాయిలును పార్టీలోకి ఆహ్వానిస్తున్న షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, మే 6: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ తెలిపారు. వర్షాలతో నష్టపోయిన పంటను రైతులను చూసి వెంటనే స్పందించి స్వయంగా తానే నియోజకవర్గంలోని నష్టపోయిన రైతులందరిని పరామర్శించి సీఎం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. అధికారుల ద్వారా సర్వేచేయించి నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కామారెడ్డిలో 10,328 ఎకరాలలో అకాల వర్షాలతో నష్టపోయిన 9,107 మంది రైతులకు పంట నష్టపరిహారం రైతుల ఖాతాలో మంగళవారం లోగా వేయాలని ప్రభుత్వం వ్యవసాయశాఖకు ఆదేశించిందని తెలిపారు. గత పది సంవత్సరాల కాలంలో ఎన్నోసార్లు పంటనష్టం జరిగినా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ప్రకటన వరకే పరిమితమైందని ఏనాడు పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిందే చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ రైతు ప్రభుత్వమని అన్నారు. అలాగే మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గ్యార లక్ష్మీసాయిలు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాలుష్యపు కోరల్లో పట్టణ కేంద్రం



రైస్‌మిల్లుల నుంచి వెలువడుతున్న బూడిద

- ఎల్లారెడ్డి పట్టణ నడి బొడ్డున ఉన్న రైస్‌మిల్లులతో తంటాలు
- వడ్ల పొల్లు, కాలుష్యంతో శ్వాస కోశ సమస్యలతో బాధపడుతున్న ప్రజలు
- రైస్‌మిల్లులను పట్టణ శివారులకు తరలించాలంటున్న ప్రజలు

ఎల్లారెడ్డి, మే 6 : ఒకవైపు వడ్ల పొల్లు.. మరోవైపు కాలుష్యంతో ఎల్లారెడ్డి పట్టణ ప్రజలు సతమతమవుతున్నారు. ప్రధాన రహదారి వెంట రైస్‌మిల్లులు ఉండటంతో ప్రజలు అటువైపు నుంచి ప్రయాణించాలంటేనే జంకే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వడ్లు పట్టిన తరువాత మిగిలిన పొల్లుతో కళ్ల, కాలుష్యంతో శ్వాసకోశ ఇబ్బందులు పడుతూ ప్రజలు అల్లాడుతున్నారు. రైస్‌మిల్లుల నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళితో చర్మ వ్యాధులు రావడంతో ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. రైస్‌మిల్లులను పట్టణ నడిబొడ్డు నుంచి తరలించి శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే తమ ఇబ్బందులు తొలగిపోతాని పేర్కొంటున్నారు.

• దుమ్ముతో పట్టణమంతా బూడిదమయం

ఎల్లారెడ్డి మండలంలో దాదాపు 14 రైస్‌మిల్లులు ఉండగా అందులో 12 పట్టణ కేంద్రాల్లోనే ఉన్నాయి. ఎల్లారెడ్డి నుంచి మెదక్ వెళ్లే రోడ్డు అనుకుని, ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వెళ్లే దారిలో ప్రధాన రహదారులపై ఈ రైస్‌మిల్లులు ఉండటంతో నిత్యం ఈ రోడ్ల గుండా ప్రయాణించే వారికి రైస్‌మిల్లులు నుంచి వెలువడే దుమ్ము, కాలుష్యంతో నానా తంటాలు పడాల్సి వస్తోంది. వడ్ల పొల్లుతో కళ్ల మంటతోపాటు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. రైస్‌మిల్లుల నుంచి వెలువడే బూడిదంతా పట్టణ కేంద్రంలో పేరుకుపోవడంతో పట్టణ మంతా బూడిదమయంగా మారుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ సమస్యలపై ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

• పట్టణ శివారులకు తరలించాలి

పట్టణ కేంద్రంలో ఉన్న కొన్ని రైస్‌మిల్లులు వాటి సామర్థ్యాన్ని పెంచాయి. కానీ పెంపునకు అనుగుణంగా తగు జాగ్రత్తలు పాటించాల్సిన యజమానులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రైస్‌మిల్లులు నడిపితే విపరీతమైన దుమ్ము, ధూళి రోడ్లపైకి వస్తోంది. పట్టణ కేంద్రంలోనే పదుల సంఖ్యలో రైస్‌మిల్లులు ఉండటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని పట్టణ కేంద్రం నుంచి శివారు ప్రాంతాల్లోకి రైస్‌మిల్లులను తరలించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కనే ఉన్న రైస్‌మిల్









కొనుగోలు కేంద్రం నుంచి

ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు అన్‌లోడ్ చేసుకోవాలి


కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్


బ్రాహ్మణపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తూ..

● సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి టౌన్, మే 6: ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని రైస్ మిల్లుల యాజమానులు కేపాసిటి మేరకు అన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. కామారెడ్డి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సోమవారం 38 బాయిల్డ్ మిల్లుల యజమానులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రెండురోజుల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని రైస్‌మిల్లర్‌లు ఎప్పటికప్పుడు దించుకోవాలని సూచించారు. ట్రక్‌షిట్లను జారీచేయాలని తెలిపారు. రైస్ మిల్లర్స్ యజమానులు మాట్లాడుతూ మిల్లులో నిల్వ ఉన్న ధాన్యాన్ని గోదాములలో అన్‌లోడ్ చేసేవిధంగా తమకు స్థలం కేటాయించాలని కోరారు. సమావేశంలో జిల్లా పౌర సరాఫరాల అధికారి మల్లికార్జున్‌బాబు, మేనేజర్ నిత్యానంద్, మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

● 'కొనుగోలు మరింత వేగవంతం చేయాలి'

తాడ్వాయి: వరి కొనుగోలు మరింత వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి, కృష్ణాజీవాడి, సంతాయిపేట గ్రామాల్లో ఆయన సోమవారం వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు పడే సమయంలో కొనుగోలు కేంద్రాలలో నిర్వహకులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వరిధాన్యం తడిసిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతుల ధాన్యాన్ని వెంటవెంటనే ట్యాబ్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 34,521 మంది రైతులకు సంబంధించిన ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


చెక్‌పోస్టు వద్ద పరిశీలిస్తున్న ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి


వదల్పర్తిలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న అమృత రాజేందర్

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

● ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి

మద్నూర్, మే 6: ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని దేశాన్ని బలోపేతం చేయాలని జుక్కల్ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జుక్కల్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉన్నవివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్నికల విధుల్లో నిమగ్నమైన పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ సిబ్బంది కోసం 3 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు.


మద్నూర్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న రిటర్నింగ్ అధికారి

● 'ఎన్నికల దృష్ట్యా పకడ్బందీ చర్యలు చేపట్టాలి'

మద్నూర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలోపెట్టుకుని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జుక్కల్ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం సలాబత్‌పూర్ వద్ద చెక్‌పోస్టును పరిశీలించి, పూర్తి వివరాలు అధికారులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ రాబోయే ఎన్నికలనాటికి మద్యం, డబ్బులు ఇతర రాష్ట్రాల నుంచి రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ ముజీబ్, తదితరులున్నారు.

● ఓటు వజ్రాయుధం

: ఐఎస్ఆర్‌డీ స్వచ్ఛంధ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి

నాగిరెడ్డి పేట: ప్రజాస్వామ్య పరిరక్షణల ఓటు వజ్రాయుధం లాంటిదని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఐఎస్ఆర్‌డీ స్వచ్ఛంధ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి అమృత రాజేందర్ తెలిపారు. సోమవారం ఇన్స్‌ఫైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఐఎస్ఆర్‌డి) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వదల్పర్తి గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు యొక్క ప్రాముఖ్యత గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రియాంకగాంధీ సభను జయప్రదం చేయాలి

● యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్

కామారెడ్డి టౌన్, మే 6: కామారెడ్డిలో నిర్వహించే ప్రియాంకగాంధి సభకు కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున హాజరుకావాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ తెలిపారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆయా నియోజకవర్గాలలోని యూత్ కాంగ్రెస్ నాయకులు యువతను పెద్ద ఎత్తున తరలించాలని తెలిపారు.మోదీ నియంతపాలనకు చరమగీతం పాడి ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకుందామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుని మనరిజర్వేషన్లను కాపాడుకోవాలని కోరారు.

యూత్ కాంగ్రెస్ నాయకులతో సమావేశమైన యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్




క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎస్ఐ ఆంజనేయులు

'యువకులు సెల్‌ఫోన్‌కు బానిస కావద్దు'

గాంధారి, మే 6: యువకులు సెల్‌ఫోన్‌లకు బానిసలు కావద్దని గాంధారి ఎస్ఐ ఆంజనేయులు అన్నారు. సోమవారం మండలంలోని రాంపూర్ గడ్డలో తెలంగాణ రాష్ట్ర ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వాలిబాల్‌కోచ్ లక్ష్మన్ రాథోడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాలిబాల్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో భవిష్యత్తు లేదని, యువకులు దాని పట్ల ఆకర్షితులై భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారని అన్నారు. మైదానాల్లో ఆడాల్సిన ఆటలు ఫోన్‌లో ఆడుతూ సమయాన్ని వృథా చేసుకున్నారని అన్నారు. పట్టణాల్లో వేల రూపాయలు పెట్టిన దొరకని క్రీడాశిక్షణ శిబిరం ఒక మారుమూల గ్రామాల్లో చేపట్టడం గొప్పవిషయమని కోచ్ లక్ష్మన్‌రాథోడ్‌ను అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బన్ని, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో అంబలి వితరణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, మే 6: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ ఏర్పాటుచేసిన అంబలి వితరణ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత 21 సంవత్సరాలు నుంచి ప్రతీ వేసవి కాలంలో ప్రజలకు అంబలి వితరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని, మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో జడ్పీ టీసీ ఉషాగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, నాయకులు గాదె తిరుపతి, ఆరీఫ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో కలిసి అంబలి తాగుతున్న ఎమ్మెల్యే

బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో..?

● అవస్థలు పడుతున్న వాహనదారులు, ప్రజలు ● వర్షాకాలంలో రోడ్డు మూసివేసిన అధికారులు ● పనులు పూర్తి చేయించడంలో విఫలమైన అధికారులు



బ్రిడ్జి నిర్మాణం కాక వర్షాకాలంలో అవస్థలు పడుతున్న వాహనదారులు (ఫైల్‌ఫొటో)



అసంపూర్తిగా ఉన్న ఆలూర్‌రోడ్డు బ్రిడ్జి

ఆర్మూర్‌టౌన్ , మే6: పట్టణంలోని ఆలూర్ రోడ్డు సుబాష్‌నగర్ రోడ్డు మధ్యలో బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. గత సంవత్సరం వర్షాకాలంలో వర్షపాతం ఎక్కువ నమోదు కావడంతో రాకపోకలను సైతం అధికా రులు రోడ్డును మూసివేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రజల అవస్థలను గుర్తించి బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించగా కాంట్రాక్టర్ పూర్తిగా బ్రిడ్జి నిర్మాణం చేయ కుండా మధ్యలోనే నిలిపివేశారు. పనులను పర్యవేక్షించాల్సిన అధికా రులు నిమ్మకు నిరెత్తినట్టు వ్యవహరిస్తూ పనులను పూర్తి చేయించ డంలో విఫలమయ్యారు. గత వర్షాకాలంలో కురిసిన వర్షానికి గూండ్ల చెరువు నిండి అలుగు వెళ్ళడంతో రహదారి మీదుగా నీరు పారి బ్రిడ్జి వద్ద నీరు నిలిచి లోతుగా నీటి ప్రవహం ఏర్పడింది. ఆర్మూర్ నుంచి ఆలూర్‌కు మోటర్ సైకిల్‌పై ఓ కుటుంబం వెళ్తుండగా నీటిలో కొట్టుకుపోయి కొనఊపిరితో ప్రాణాలను దక్కించుకున్నారు. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అప్పటి ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌ను, అధికారులను త్వరలో పూర్తి చేయా లని ఆదేశించారు. అయిన అధికా రులు పెడచెవిన పెట్టడంతో ఇప్పటి వరకు బ్రిడ్జి పనులు పూర్తి కాలేదు. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికి వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. నందిపేట్, ఆలూర్ మండలాలతో పాటు గ్రామాలకు సం బంధించిన ప్రజలు ఆర్మూర్‌కు అత్యవసర పరిస్థితుల్లో రావాలంటే వర్షాకాలంలో చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతోపాటు ఆర్మూర్ మండలంలోని గ్రామాల్లో నివాసించే ప్రజలు సైతం ఆర్మూర్‌కు రావల్సిందే. బ్రిడ్జి పనులు పూర్తి కాకపోవడంతో మాక్లూర్ మండలం నుంచి ఆర్మూర్‌కు రావల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా రాబో యే వర్షాకాలం వరకైన బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేసి వాహన దారులకు, ప్రజలకు అంతరాయం కలుగకుండా చూడాలని నాయకు లను, అధికారులను వేడుకుంటున్నారు.

స్పందించని అధికారులు

రోడ్లు భవనాల శాఖ అధికారులు బ్రిడ్జి నిర్మాణ పనులపై వివరణ అడుగగా స్పందించకపోవడంలో అంతర్యమేమిటో అర్థంకావడంలేదు. గత పది రోజులుగా కార్యాలయంలో అందుబాటులో ఉండకపోగా చరవాణిలో వివరణ అడుగగా మ ళ్లీ చెబుతానంటు దాటవేస్తున్నారు.ప్రజల సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే తాను చేసే ఉద్యోగానికి న్యాయం చేయాలని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



మా జీవనభృతి అయిన పంట పొలాల్లో వేసుకున్న పంట పరిస్థితిని చూడాలంటే వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. వచ్చేవర్షాకాలం లోపు బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే విధంగా నాయకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

- ఇస్సాపల్లి నవీన్, రైతు

కమ్మర్‌పల్లిలో కేసీఆర్‌కు ఘన స్వాగతం



కమ్మర్‌పల్లిలో బస్సులో నుంచి అభివాదంచేస్తున్న కేసీఆర్

కమ్మర్‌పల్లి, మే 6: జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తరపున ఎన్నికల ప్రచార నిమిత్తం రోడ్‌షో, కార్నర్ మీటిగ్‌ల ని మిత్తం జగిత్యాల నుంచి జిల్లా సరిహద్దు కమ్మర్‌పల్లి మీదుగా నిజామాబాద్ వెళ్తతున్న కేసీఆర్‌కు కమ్మర్‌పల్లి వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులు, మహిళలు గులాబీ పూలు జల్లుతు ఘనస్వాగతం పలికారు. సాయంత్రం ఆరున్నరప్రాంతంలో కమ్మర్‌పల్లికి చేరుకున్న కేసీఆర్‌కు పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ , వీజీగౌడ్, రాజారాం యాదవ్ తదితర బీఆర్‌ఎస్ నాయకులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. కేసీఆర్ బస్సురాగానే మహిళలు మంగళ హారతులు పట్టుకుని స్వాగతం పలుకగా రోడ్డుపక్కన మహిళలు గులాబీపూలుజల్లారు. బస్సులోనుండే కేసీఆర్ అభివాదం చేస్తూ విక్టరీ గుర్తును చూపారు. ఆయనతో పాటు బస్సులో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, బీఆర్‌ఎస్ ప్రముఖులు ఉన్నారు. కమ్మర్‌పల్లి వద్ద స్వాగతం పలికిన వారిలో ఎంపీపీ లోలపు గౌతమి, మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవందర్, బద్దం చిన్నారెడ్డి, కొత్తపల్లి రము, లుక్కగంగాధర్ తదితర బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

సిద్ధులగుట్టపై ఘనంగా పల్లకీ సేవ



సిద్దులగుట్టపై పల్లకిసేవలో పాల్గొన్న భక్తులు

పెర్కిట్, మే6: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా పల్లకిసేవ నిర్వహించారు. సిద్ధులగుట్టపై రామాలయం, దుర్గామాత, దత్తత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మతల్లి, ఏకశిల స్తంభం గల హన్మాన్ ఆలయం, శివాలయంలోని సిద్దేశ్వరునికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకిసేవలో ఆర్మూర్ భజన మండలి సభ్యులు భజనలు, నృత్యాలు చేశారు. గుట్టపై విచ్చేసిన భక్తులకు నూతుల చిన్నారెడ్డి లత కుటుంబసభ్యులు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, బోండ్ల ఆనంద్, ప్రశాంత్‌గౌడ్, రవి, సంధ్య, కొంతం మంజుల మురళీ, పొద్దుటూరి చరణ్‌రెడ్డి, బట్టు శంకర్, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఏడు నెలల బాబుతో వివాహిత అదృశ్యం



అదృశ్యమైన టేకు రాణి, బాబు(ఫైల్)

వేల్పూర్, మే6: వేల్పూర్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన చింతల టేకు రాణి(24) అనే వివాహిత తన ఏడు నెలల బాబుతో అదృశ్యమైనట్టు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.నిజాంసాగర్‌కు చెందిన వివాహిత రాణి సుమారు మూడు నెలల నుంచి భర్త కృష్ణతో కలిసి వెంకటాపూర్‌లో కూలీ పని చేసు కుంటూ జీవిస్తుందన్నారు. సోమ వా రం ఉదయం ఇంట్లో ఎవరికి చెప్ప కుండా తన ఏడు నెలల బాబును తీసుకొని కనిపించకుండా పోయిందన్నారు. భర్త కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. ఎవరికైనా ఆచూకి తెలిస్తే 8712659862నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

'రైతుబంధును చూపించి తప్పించుకుంటున్నారు'



మాట్లాడుతున్న ఏఐకేఎస్ నాయకులు

పెద్దబజార్, మే 6: రైతన్న ఎదుర్కొంటున్న సమస్యలకు రైతుబంధును చూపించి గత ప్రభుత్వం బీఆర్‌ఎస్ నాయకులు తప్పించుకున్నారని ఏఐకేఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవరాం, రాష్ట్ర నాయకులు వి.ప్రభాకర్‌లు అన్నారు. సోమవారం నగరంలోని కోట గల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో పబ్లిక్ సంస్థలను ఆదాని, అంబానీలకు కారుచట్టుగా అప్పచెప్పి ఎయిర్‌పోర్టు, బొగ్గగనులు, సముద్ర సంపద అంతా కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పి మిగిలిన పెద్ద శక్తులైన వ్యవసాయ రంగాన్ని ఆదాని, అంబానీ వారికి అప్పచెప్పారని అన్నారు. ఢిల్లీ కేంద్రంగా రైతు ఐక్య ఉద్యమం 13 మాసాలు 750 మంది ప్రాణత్యాగాలతో సాగిన పోరాటం తెలిసిందేనన్నారు. కనీస మద్దతు ధర రూ.15వేల చొప్పున ఎంఎస్‌సి జాబితాలో ఐదు రోజుల్లోనే చేర్చుతామని ఐదు సంవత్సరాలు గడిచిన అటు పసుపు బోర్డు గానీ, ఇటు ఎంఎస్‌సి గానీ సాధించలేదన్నారు. ఢిల్లీలో మోదీ మోసం చేస్తే జిల్లాలో అర్వింద్ మోసం చేశాడని అందుకే బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ నాయకులు కిరణ్, పశ్యపద్మ, అవినాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ విద్యార్థులకు సన్మానం



డొంకేశ్వర్‌లో విద్యార్థులను సన్మానిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, డీసీసభ్యులు

డొంకేశ్వర్, మే6: పది పరీక్ష ఫలితాల్లో డొంకేశ్వర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన 82మంది విద్యార్థులు 10జీపీఏ సాధించారు. పది ఫలితాల్లో విద్యార్థులు ప్రణవతేజగౌడ్, లవన్‌కుమార్, నిశాంత్‌లు 10జీపీఏ సాధించినట్టు పాఠశాల హెచ్‌ఎం సురేష్‌కుమార్ తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులను శాలువ, పూలమలలతో ఘనంగా సన్మానించగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సహకాన్ని అందించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శేఖర్ గౌడ్, గ్రామాభివృద్ధి కమిటీ కోశాధికారి కల్లెం గంగారెడ్డి, మధు, ఉపాధ్యాయులు సదానంద్, గంగారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు శ్యామ్, నగేష్‌గౌడ్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో ఛత్రపతి సాహుజీ102వ వర్ధంతి

మోర్తాడ్, మే6: మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే విగ్రహం వద్ద ఛత్రపతి సాహుజి మహరాజ్ 102వ వర్ధంతిని దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సాహుజి చిత్రపటానికి అల్లూరి రాజారాం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జంబవ జమర్, మామిడి గంగాధర్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

రూ.24లక్షల అల్ఫ్రాజోలం పట్టివేత



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ సోమిరెడ్డి

సుభాష్‌నగర్, మే 6: అల్ఫ్రాజోలం సరఫరా చేస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు ఐదుగురిని పట్టుకొని వారి నుండి సుమారు 24లక్షల విలువ గల అల్ఫ్రాజోలం, 5వేల విలువగల క్లోరో హైడ్రేడ్‌ను పట్టుకున్నామని ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ సోమిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని మూడు ప్రాంతాల్లో ఒకేసారి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో మూడు టీమ్‌లుగా తయారై దాడులు నిర్వహించామని తెలిపారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం ఎక్స్‌రోడ్ వద్ద, బోధన్ మండలం కుర్నాపల్లిలో, నిజామాబాద్ పట్టణంలో మూడు చోట్ల తనిఖీలు చేయగా సుమారు 24లక్షలకు పైగా విలువగల 2.32 కేజీల అల్ఫ్రాజోలం దొరికిందని తెలిపారు. అల్ఫ్రాజోలంతో పాటు 0.53 గ్రాముల క్లోరో హైడ్రేడ్‌ను పట్టుకున్నామని తెలిపారు. అల్ఫ్రాజోలం సరఫరా చేస్తున్న గొల్లపల్లి యాదగిరి గౌడ్, తాటికొండ నర్సయ్య, రాజేష్‌కుమార్, సుప్పని నవీన్‌కుమార్, షేక్ హుస్సేన్‌లను అరెస్టు చేశామని వారిని రిమాండ్‌కు పంపను న్నామని తెలిపారు. రాజేందర్‌గౌడ్, నాగరాజు గౌడ్, శంకర్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరి నుంచి 4 మోటర్ సైకిల్ వాహనాలు, ఐదు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమీషనర్ చంద్రబానునాయక్, ఇన్స్‌పెక్టర్లు స్వప్న, వెంకటేశ్, ఎస్సైలు నర్సింహాచారి, హెడ్ కానిస్టేబుల్ నారాయణరెడ్డి, భోజన్న, రాంబచ్చన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అమిత్‌షా పాత హామీలను మళ్లీ చెప్పారు'



సమావేశంలో మాట్లాడుతున్న ఈరవత్రి అనిల్

నిజామాబాద్ అర్బన్, మే 6: కేంద్ర మంత్రి అమిత్‌షా జిల్లా పర్యటనలో భాగంగా ఇచ్చిన హామీలన్నీ గతంలో ఇచ్చినవేనని కొత్తగా ఇచ్చిన హామీలు ఏమీ లేవని పాత అబద్ధాలనే మళ్లీ చెబుతున్నారని రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్, మాజీ విప్ అనిల్ అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పసుపు బోర్డు ఇవ్వకుండా కనీసం జీవో ఇవ్వకుండా నిజామాబాద్‌లోనే పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పడం ఆ విషయంలో స్పష్టత లేదన్నారు. ప్రజలను మోసం చేసేందుకే అమిత్‌షా పాత ప్రకటనలు ఇచ్చారని దీనికి బీజేపీ అభ్యర్థి అర్వింద్ జవాబు చెప్పాలన్నారు. గతంలో ఎంపీగా పని చేసిన కవితకు జిల్లా రైతులు గుణపాఠం చెప్పిన విధంగానే ఈ ఎన్నికల్లోనూ బీజేపీకి గుణపాఠం చెబుతారన్నారు. బీడీ కార్మికుల కోసం గతంలోనూ ప్రత్యేక ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని కాని మళ్లీ అదే హామీని చెబుతున్నారని అన్నారు. షుగర్ ఫ్యాక్టరీ గురించి బీజేపీ నేతలు రోజుకో మాట చెబుతున్నారని అన్నారు. గత ఐదేళ్లుగా షుగర్ ఫ్యాక్టరీని ఎందుకు ప్రారంభించలేదో చెప్పాలని కోఆపరేటివ్ సొసైటీ ద్వారా ఎందుకు నడపడం లేదో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు షుగర్ ఫ్యాక్టరీని తొందరలోనే ప్రారంభిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ కులగణనకు కట్టుబడి ఉందని బీజేపీ మాత్రం ఉన్న రిజర్వేషన్లను తీసేసే కుట్ర చేస్తుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలన్నారు. 8వ తేదీ సీఎం రేవంత్‌రెడ్డి ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్‌లలో కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారని నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు కేశవేణు, నాయకులు రత్నాకర్, జావెద్ అక్రమ్, రాంభూపాల్, ఈసా, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా.. ప్రారంభంకాని కల్వర్టు పనులు



కల్వర్టు వద్ద తాత్కాలికంగా మొరం వేసి దృశ్యం

కమ్మర్‌పల్లి, మే 6:కమ్మర్‌పల్లి నుంచి ఉప్లూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో వరద కాలువ వద్ద కల్వర్టు పనులు ప్రారంభంకాకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.ఈ రహదారి గుండా ప్రతీ శుక్రవారం పవిత్రగోదారి పుణ్యక్షేత్రంతో పాటు ఏరట్ల మీదుగా వర్షాకొండా, గుమ్మిర్యాల్, గోదావరికి వెళ్తుంటారు. గత6 సంవత్సరాలక్రితం భారీ వర్షాలకు కల్వర్టు వద్ద గండిపడగా అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేస్తు చేతులుదులుపుకుంటున్నారు.ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ముందు (అప్పటి రోడ్లు భవనాల శాఖ మంత్రి) ప్రస్తుత బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కల్వర్టు పనులు చేపట్టడం నిమిత్తం తగు నిధులు మంజూరు చేస్తు పనులకు శంకుస్థాపన చేశారు కాని సదరు కాంట్రాక్టర్ పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారు. కల్వర్టు నిర్మాణ సమయంలో బైపాస్ ఏర్పాటు చేయాలి. పంటలు పోలాలకు వెళ్లేందుకు రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పంటలు కోయగానే పనులు ప్రారంభిస్తామన్నారు. కాని ఈ రోజు వరకు పనుల ప్రారంభంలేదు. కల్వర్టు గుంత కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవ రాత్రి సమయంలో ఒక కారుగుంతలో తలకిందులుగా బోల్తాపడి పెను ప్రమాదం తప్పింది. అందులో ఉన్నవారిని రహదారి గుండా ప్రయాణాలు సాగిస్తున్నవారు కారుఅద్దాలు పగుల గొట్టి బైటకు తీసినట్లు వారికి ఎలాంటిగాయాలు కాలేదు. ఉప్లూర్ బాలరాజరాజేశ్వర స్వామి (మహాశివ రాత్రి) జాతరా సందర్భంగా ప్రమాదాలు సంభవించకుండా గ్రామకమిటి ఆదేశాల మేరకు కల్వర్టు గుంతవద్ద మొరం కుప్పలు పోశారు. జాతరా ముగిసి నప్పటికి పనుల జాడ లేదు.ఇప్పటికైనా కల్వర్టు మరమ్మతు పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని స్థానికులు వాహనాదారులు కోరుతున్నారు.

త్వరగా పనులు ప్రారంభించాలి



కమ్మర్‌పల్లి వరదకాలువ వద్ద ఉప్లూర్ వెళ్లేదారిలో ప్రమాదకరంగా మారిన కల్వర్టు మరమ్మతు పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి అయ్యేలా చూడాలి. కమ్మర్‌పల్లి నుంచి ఉప్లూర్ గ్రామానికి ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వందల సంఖ్యలో ఈ రహదారిగుండా ప్రయాణాలు సాగిస్తుఉంటా రు.మరమ్మతు పనులకు టెండర్లు ఖరారైనప్పటికీ ప్రభుత్వం మారడంతో పనులు ముందుకు సాగడంలేదు.అధికారులు ఇప్పటికైనా స్పందించి పనులు పూర్తి అయ్యేలా చూడాలి.

-సుంకరి విజయ్ కుమార్ ఉప్లూర్

ఉపాధిహామీ కూలీలకు వడదెబ్బపై అవగాహన



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న పిహెచ్‌సీ సిబ్బంది

ఏర్గట్ల, మే 6: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంతో పాటు తాళ్లరాంపూర్, నాగేంద్రనగర్ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల దగ్గరకు వెళ్లి ఎండ తీవ్రత, వడదెబ్బ తగలటం వంటి విషయాలపై రిపోర్టింగ్ అధికారి ఆకుల మారుతీగౌడ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పండరి, కల్పన, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మాజీ ఎంపీపీ

ఇందల్వాయి, మే 6: ఇందల్వాయి మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన సంపంగి మహేందర్ ఇటీవల సర్పల్లి తండా వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తూ చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందడంతో ఆ కుటుంబానికి మాజీ ఎంపీపీ ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇమ్మడిగోపి మృతుడి భార్యకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలో ఏ పేద కుటుంబానికి ఆపద వచ్చిన ముందుండి భరోసాగా నిలుస్తున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గౌరారం మాజీ ఉపసర్పంచ్ గోద స్వామి, తొగరి సాయిలు, రాజమల్లు, బాలయ్య, తదితరులు ఉన్నారు.

మోర్తాడ్ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

మోర్తాడ్, మే6: మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో అడ్మిషన్‌లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దన్న తెలిపారు. కళాశాలలో ఉచితంగా ఆన్‌లైన్ సర్వీస్‌లు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. పరిసర మండలాల విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్ పాస్ అయిన వారు పదవ తరగతి సర్టిఫికెట్, ఆధార్, బోనాఫైడ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు రెండు ఫొటోలతో కళాశాలలో దోస్త్ హెల్ప్‌లైన్ ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవాని అన్నారు. అన్ని కోర్సులు కళాశాలలో ఉన్నాయని ఆంగ్ల మాధ్యమంలో కూడా ఉన్నాయని, ల్యాబ్ సౌకర్యం, ఫ్యాకల్టీ సౌకర్యం ఉందని ఆయన తెలిపారు.

సామాజిక సేవకులకు సన్మానం

ఆర్మూర్‌టౌన్ , మే6: మున్సిపల్ పరిధిలోని రక్ష స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వివిధ రంగాల్లో సామాజిక సేవలు చేస్తున్న పలువురిని ఘనంగా సన్మానిం చారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న విద్యాప్రవీన్, పట్వారి గోపికృష్ణ, తులసీ, మీర శ్రావణ్‌లను పట్టుశాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రక్ష స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకులు ఖాందేశ్ శ్రీనివాస్, గోనే శ్రీధర్, జిందం నరహరి, ఎస్‌జీ.శ్రీకాంత్, బేతు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రత వారోత్సవాలు

ఆర్మూర్‌టౌన్, మే6: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం డివిజన్ స్థాయి విద్యుత్ భద్రత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ డీఈ హరిచంద్ మాట్లాడుతూ విద్యుత్ భద్రత నియమాలు పాటించాలని, విద్యుత్ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏడీఈ శ్రీధర్, రాజేశ్వర్, ఏఈలు మనిష, ఆశ్రీత, బాల్‌రాజ్, డివిజన్‌స్థాయిలోని ఏఈలు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.



విద్యుత్ భద్రత వారోత్సవాల్లో మాట్లాడుతున్న విద్యుత్ డీఈ హరిచంద్

చివరి ఆయకట్టుకు అందని సాగునీరు!


గుత్ప పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న స్వర్గీయ మాజీ సీఎం వైఎస్సార్ (ఫైల్‌ఫొటో)


గుత్ప లిఫ్ట్ మొదటి పంపుహౌస్


గ్రావిటీ కెనాల్‌లోని చెట్లు

- గుత్పకు పదహారేళ్లు పూర్తయినా ఫలితం అంతంతే..
- సీసీ లైనింగ్‌కు నోచుకోని గ్రావిటీ కెనాల్
- ఫలించని అధికారుల భగీరథ ప్రయత్నం
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- ప్రత్యామ్నాయం చూపాలని ప్రభుత్వానికి వేడుకోలు

నందిపేట, మే 6 అప్పటి ఉమ్మడి రాష్ట్రప్రభుత్వం జలయజ్ఞం పేరుతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకానికి పదహారేళ్లు నిండాయి. అయినప్పటికీ ఫలితం అంతంత మాత్రమే. గోదావరి జలాల ద్వారా నిజాంసాగర్ చివరి ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో రూ.204కోట్ల వ్యయంతో చేట్టిన పథకాన్ని స్వర్గీయ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజ శేఖర్‌రెడ్డి 2008 మార్చి 18న జాతికి అంకితం చేశారు. నాలుగు, ఐదు సంవత్సరాల పాటు రెండు పంటలకు సాగు నీరు అందించిన ప్రాజెక్టు నేడు దీన స్థితిలో ఉంది. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. ఇప్పటికి గ్రావిటీ కెనాల్ పూర్తి స్థాయి సీసీ లైనింగ్‌కు నోచుకోలేదు. నందిపేట ఆయకట్టుకు సాగు నీరు అందించాలని నిర్మించిన రెండు ప్రత్యేక పైప లైన్లలో ఒకటి పనికిరాకుండా పోయింది. దీంతో చివరి ఆయకట్టుకు సాగు నీరు అందడం కలగానే ఉండిపోయింది. సుమారు 5వేల ఎకరాలు బీడు గా మారాయి. ఈసంవత్సరం సమృద్ధిగా వర్షాలు పడినప్పటికి సీసీ లైనింగ్ లేక, పిచ్చిమొక్కలతో నిండిన గ్రావిటీ కెనాల్ ద్వారానే నీటి సరఫరా జరిగింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో ఎకరాలకు అధికారులు సాగు నీరు అందించలేకపోయారు. ఈరబీ సీజన్‌లో మాత్రం అధికారులు భగీరథ ప్రయత్నమే చేశారు.

● ముందుమాట

నందిపేట మండలంలోని ఉమ్మెడ పాత గ్రామం శివారులోని గోదావరి ఒడ్డున ఎనిదేళ్ల క్రిందట ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా రు.204 కోట్లతో అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. ఆరు మండలాల్లోని (నందిపేట, మాక్లూర్, ఆర్మూర్, జక్రాన్‌పల్లి, వేల్పూర్, బాల్కొండ) 38వేల 792 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రెండు పం పౌస్‌లు ఏర్పాటు చేశారు. ఒకటి ఉమ్మెడలో మరోకటి మాక్లూర్ మండ లం లక్మాపూర్‌లో. బజార్‌కొత్తూర్ శివారులో నుంచి మాక్లూర్ మండ లం ధర్మోర చెరువువరకు 9కిలో మీటర్ల పొడవుతో గ్రావిటీ కెనాల్‌ను నిర్మిం చారు. మొదటి పంపు హౌస్ ద్వారా నాలుగు మోటార్లతో కెనాల్ ద్వారా ధర్మోర చెరువులోకి నీరువెళితేనే నిజాంసాగర్ చివరి ఆయకట్టువరకు సా గునీరు సమృద్ధిగా అందుతుంది. కానీ నాలుగు మోటార్లతో నీటిని వదిలి తే,గ్రావిటీకెనాల్ కోతకు గురవుతోంది. దీంతోఅధికారులు రెండు, మూడు మోటార్లతోనే సరిపెట్టుతున్నారు. సారునీరు అందని మిగతా మండలాల రైతులు ఆందోళనలకు దిగారు. ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెచ్చారు.

● అసంపూర్తిగా గ్రావిటీ కెనాల్ సీసీ లైనింగ్

రైతు నాయకుల ఒత్తిడి మేరకు 2011లో సిమెంట్ లైనింగ్ పనులకు రు.6కోట్లు మంజూరు చేసింది ప్రభుత్వం. ధరలు పెరగడంతో రెండు పర్యాయాలు టెండర్లు పిలిచినా కంపెనీలు ముందుకు రాలేవు. మళ్లీ ప్రభుత్వం రూ.7కోట్లు మంజూరు చేసింది. తాడూరి బాలేశ్వర్‌రెడ్డి అండ్ కన్‌స్ట్రక్షన్ (టీబీఆర్)కంపెనీ పనులు దక్కించు కుంది. వర్షాలతో వాతావరణం అనుకూలించక, ఖరీఫ్, రబీకి నీరు అందించడంతో సిమెంట్ లైనింగ్ పనులు ఆలస్యంగా మొదలైనాయి. రు.3 కోట్ల విలువచేసే పనులు చేస్తే అధికారులు మాత్రం రు.1.30కోట్లు మాత్రమే చెల్లించారు. మిగతా డబ్బుల విషయమై అధికారులను సంప్రదిస్తే బడ్జెట్ అయిపోయిందని చేతులేత్తేశారు. దీంతో సదరు కంపెనీ పనులను మధ్యలోనే నిలిపేసింది. తర్వాత డెలివరీ సిస్టర్న్ వద్ద అలాగే 133/11కెవి సబ్ స్టేషన్ దగ్గర కొద్దిపాటి సిమెంట్ లైనింగ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయినా కొత్త ప్రభుత్వం పరిపాలిస్తున్నప్పటికి ఈ పథకంను పట్టించుకోక పోవడంపై రైతులు సర్వత్రా విమర్శలు గుప్పిస్తున్నారు. ఇంతపెద్ద పథకంను అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించు కోక పోవడంపై రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

● ఇదీ చరిత్ర

అంక్సాపూర్ అశోక్‌రెడ్డి అనే రైతు గుత్ప లిఫ్ట్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ 1993, అక్టోబర్ 2న ఉద్యమం చేపట్టారు. ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించారు. అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం 1999, జూన్ 25న లిఫ్ట్ మంజూరు చేస్తూ జీవో 120ని జారీ చేసింది. అదే తడవుగా మరుసటి రోజున అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రతి పక్షాలు పలు మార్లు శిలాఫలకానికి తద్దినాలు నిర్వహించారు. గుత్ప సాధన సమితి 2003, మే 21న అమరణ నిరాహార దీక్ష చేపట్టింది. స్పందించిన ప్రభుత్వం మే 24న సాంకేతిక మంత్రిగా ఉన్న నేరేళ్ల ఆంజనేయులు జోక్యంతో నిరాహార దీక్షను విరమింప జేసిం ది. సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో విద్యా శాఖ మంత్రిగా ఉన్న మండవ వెంకటేశ్వర్ రావు 2004లో గ్రావిటీ కెనాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో 2005, ఏప్రిల్ 3న రాష్ట్ర ముఖ్యంమత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుత్ప లిఫ్ట్ పనులను ప్రారంభించారు. అక్కడే రాష్ట్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, పైపులైన్ డిజైనింగ్, సిమెంట్ కోటింగ్‌లపై చర్చించి పూర్తి స్థాయి ఆదేశాలు జారీ చేశారు. పనులు దక్కించుకున్న పలు కంపెనీలు అడపాదడపా పనులు పూర్తి చేయగా 2008 మార్చి 18న నీటి విడుదల చేసి స్వర్గీయ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజ శేఖర్‌రెడ్డి గుత్ప లిఫ్ట్‌ను జాతీకి అంకితం చేశారు. అప్పటి నుంచి రెండు పంటలకు సాగు నీరు అందించిన అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకం నేడు ఆశించిన స్థాయిలో సాగు నీరు అందించడం లేదు.

పథకం వివరాలు:

ఆయకట్టు	: 38, 792 ఎకరాలు
అంచనా వ్యయం	: రూ.204కోట్లు
లబ్ధి మండలాలు	:నందిపేట, మాక్లూర్, ఆర్మూర్, బాల్కొండ, వేల్పూర్, జక్రాన్‌పల్లి
నీటి పరిమాణం	: 540 క్యూసెక్కులు
నీటి ఎత్తు	: 69.32 మీటర్లు
పైపులైన్	: 11.29కి.మీ
గ్రావిటీ కెనాల్	: 9.085కి.మీ
పంపుహౌస్‌లు	: రెండు
మోటార్లు	:మొదటి పంపుహౌస్ వద్ద 2250 కిలోవాట్లు సామర్థ్యం గలవి నాలుగు. రెండవ పంపుహౌస్ వద్ద 1725 కిలోవాట్లు సామర్థ్యం గలవి నాలుగు(వర్టికల్ టర్బన్ రకం)
విద్యుత్ సామర్థ్యం	: 18 మెగావాట్లు.(0.41మిలియన్ యూనిట్లు) డిస్ట్రిబ్యూషన్- నిజాంసాగర్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటర్ 74 నుంచి డి.82 వరకు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు

ఆరు గ్యారంటీలను తప్పక అమలు చేస్తాం

● జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు

నిజాంసాగర్, మే6: కాంగ్రెస్ ఆరుగ్యారంటీలను తప్పకఅమలు చేస్తుందని, రైతులకు రుణమాఫీ ఆగస్టు 15లోపు చేస్తామని భరోసా ఇచ్చారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు అన్నారు. సోమవారం నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట్, బ్రాహ్మణ్ పల్లి, ఆరేడు తదితర గ్రామాల్లో జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ శెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గతంలో ఎంపీగా పనిచేసిన వారు జుక్కల్ నియోజకవర్గ అభివృదికి చేసిందేమీ లేదని అన్నారు. సురేష్ శెట్కార్‌ను ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గానికి అధికనిధులు తీసుకుని వచ్చి మరింత అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో చైర్మన్ కాసుల బాల్‌రాజ్, జయ ప్రదీప్, రవీందర్ రెడ్డి, మల్లి కార్జున్, పండరి, రమేష్, తదితరులున్నారు.

నిజాంసాగర్‌కు తరలిన బీఆర్ఎస్ నాయకులు

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), మే6: నిజాంసాగర్‌లో సోమవారం నిర్వహించే బీఆర్ఎస్ సమావేశానికి మహ్మద్‌నగర్ మండలం నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఉమ్మడి జిల్లాల మాజీ జడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్ సీజ్


సీజ్‌చేసిన ట్రాక్టర్ ఇదే..

రాజంపేట, మే6: రాజంపేట మండలంలోని ఎల్లారెడ్డిపల్లి తండాలో అటవీ భూమిని అక్రమంగా చదును చేస్తున్న కప్పల రమేష్‌కు చెందిన ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి రమేష్ తెలిపారు. అటవీ భూమిలో అక్రమంగా చదును చేయడంతో ఆదివారం రాత్రి ట్రాక్టర్‌ను సీజ్ చేసి కామారెడ్డి అటవీ శాఖ కార్యాలయానికి తరలించామని తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు ఫారుఖ్, బాబా, బీట్ అధికారులు దేవేందర్, లచ్చయ్య, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

'భాషా పండితులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి'

డిచ్‌పల్లి,మే 6: నూతన పీఆర్సీలో భాషా పండితులకు న్యాయం చేయాలని అప్పర్ ప్రైమర్ మరియు హైస్కూల్‌లో బోధిస్తున్న భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్ వేతనం అందించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ల తో పాటు సభ్యులు పీఆర్సీ చైర్మన్ శివశంకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా అధ్యక్షుడు అబ్దుల్లా మాట్లాడుతూ.. ఇప్పటి వరకు కేవలం 150 రూపాయల అదనం వేతనంతో భాషా పండితులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని సమాన పనికి సమాన వేతనం వర్తింప జేయాలని కోరారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని, 44శాతం పిట్మెంట్ సిఫారస్ చేయాలని ఉపాధ్యాయులకు ఇస్తున్న ఆరు ఇయర్స్ లీవ్‌లను 15కు పెంచాలని కోరారు. ఈ విషయాలపై కమిషన్ ఛైర్మన్ సానుకూలంగా వ్యక్తం చేశారని తెలిపారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

బోధన్‌రూరల్,మే6: ప్రభుత్వ పాఠశాలతో పాటు గురుకులాలలో చదివే విద్యార్థినులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజరి గంగారాం అన్నారు. సోమవారం బోధన్ పట్టణానికి చెందిన సాత్విక అనే విద్యార్థిని కామారెడ్డి జిల్లా జంగంపల్లి గురుకుల పాఠశాలలో పదవ తరగతిలో 10/10జీపీఏ సాధించడంతో నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, విశ్రాంత ఉపాధ్యాయులు సుబ్బారావు, రవి శంకర్ గౌడ్, అశోక్, గౌడ్, ప్రవీణ్ జాదవ్ నాయక్, డప్పుల చంద్రయ్య, సాగర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నాయకుల నివాళి

భిక్కనూరు, మే6: అనారోగ్యంతో మృతిచెందిన భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన కొయ్యల మోహన్‌గౌడ్‌కు కాంగ్రెస్ నాయకులు సోమవారం నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మోహన్‌గౌడ్ మృతదేహానికి పూలమాలు వేసి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.


నివాళులు అర్పిస్తున్న నాయకులు

మంచి పనులు చేస్తేనే ప్రజలు నమ్ముతారు

● బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

నిజాంసాగర్, మే 6: మంచిపనులు చేస్తేనే ప్రజలు నాయకులను నమ్ముతారని మాజీ సభాపతి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిజాంసాగర్ మండల కేంద్రంలో సోమవారం ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సొంత ప్రయోజనాల కోసమే పార్టీలు వీడి వేరే పార్టీలో చేరి పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలుచున్న మాజీ ఎంపీ బీబీపాటిల్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఎంపీ అంటే బీబీ పాటిల్ జాగీర్ ఆ అని ప్రశ్నించారు. పదేళ్లలో బీబీ పాటిల్ ఏం అభివృద్ధి ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుంచి పార్లమెంట్ టికెట్ రాదని, రాత్రికి రాత్రి బీజేపీలో చేరిన నాయకునికి ప్రజలు నమ్మడం లేదన్నారు. బీసీ నాయకునిగా ఉద్యమం నుంచి కొనసాగుతూ వచ్చిన గాలి అనిల్ కుమార్‌ను ప్రతి ఒక్కరూ అమూల్యమైన ఓటు కారు గుర్తుకు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మరో కాంగ్రెస్ నాయకులు గతంలో ఎంపీగా పనిచేశారని, కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న ఆయన జహీరాబాద్‌కు ఏం చేశారో ప్రజలు గుర్తిస్తూనే ఉన్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పదేళ్లలో ఏం చేసిందో ప్రజలకు తెలుసని, ప్రజలు తెలంగాణ వెంటనే ఉంటూనే ఉన్నారన్నారు. మిషన్ భగీరథతో స్వచ్ఛమైన తాగు నీరు, మిషన్‌కాకతీయ కింద పూర్వవైభవం, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో సాధ్యమైందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే మాట్లాడుతూ పదేళ్లలో జుక్కల్‌ను అభివృద్ధి చేసినఘనత బీఆర్ఎస్‌దని అన్నారు.

సాగర్‌లో రోడ్ షో సక్సెస్

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఉమ్మడి మండలాలైననిజాంసాగర్‌లో సోమవారం రోడ్ షో నిర్వహించారు. సుమారు 1500లకు పైగా ప్రజలు రావడంతో రోడ్ షో ప్రజలతో కిటకిటలాడింది. రోడ్ షో సక్సెస్ కావడంతో కార్యకర్తల్లో అనిల్ కుమార్‌గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 3 గంటల పాటు రోడ్ షో కార్యక్రమం మండల కూడలి వద్ద జరుగడంతో రాకపోకలను పోలీసులు అంతరాయం కలుగకుండా ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.


పోలీంగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

పిట్లంలో పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

పిట్లం, మే6: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల పోలింగ్‌కేంద్రాలను సోమవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు పూర్తిగాసౌకర్యాలు కల్పించాలని ఎన్నికల సిబ్బందికి ఆదేశించారు. వివరాలు సిబ్బందికి అడిగి, పలు సూచనలు, సలహాలు సూచించారు. ఆయన వెంట కార్యదర్శి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన మే పుష్పం..!

కామారెడ్డిటౌన్, మే6: కామారెడ్డి పట్టణంలోని కాకతీయనగర్ కాలనీలో ఓ ఇంట్లో మే పుష్పం విరబూసింది. ఎరుపు రంగులో ఉన్న ఈ పుష్పం చూపరులను ఆకర్షిస్తోంది. కాకతీయనగర్ కాలనీలో నివాసం ఉండే సిరిగాధ శంకర్ ఇంట్లో మే పుష్పం వికసించడంతో సదరు కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తంచేశారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే మే మాసపు పూవ్వులు వికసించినట్లు వారు తెలిపారు.


వికసించిన మే పుష్పం


మృతిచెందిన బాలుడు అన్విత్

నీటి సంపులో పడి బాలుడి మృతి


అన్విత్ (ఫైల్ ఫొటో)

కామారెడ్డి టౌన్, మే 6: నీటి సంపులో పడి ఓ బాలుడు మృతిచెందిన ఘటన కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కాపూర్ గ్రామానికి చెందిన దేవరాజ్, నవ్యలకు మూడేళ్ల కుమారుడు అన్విత్ ఉన్నాడు. నవ్య చిన్న మల్లారెడ్డిలో ని తన తల్లి ఇంటికి ఆదివారం సాయంత్రం కుమారు డితో వచ్చిం ది. అన్విత్ ఆడుకుంటూ వెళ్లి ఇంటి పక్కనే ఉన్న సంపులో పడి ఊపిరి ఆడక మృతిచెందినట్లు గ్రామ స్థులు తెలిపారు. బాలుడి మృతితో గ్రామంలో విషాచాయలు అలుముకున్నాయి.

వడదెబ్బ తగిలితే ప్రథమ చికిత్స అందించాలి

● ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్


నవీపేటలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

నవీపేట, మే 6: రాష్ట్రంతో పాటు జిల్లాలో సైతం ఎండలు అధికంగా ఉన్నందున వడదెబ్బ తగిలిన వారికి వైద్య సిబ్బంది వెంటనే ప్రథమ చికిత్స అందించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు అన్ని సబ్ సెంటర్‌లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని కోరారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలకు ఇచ్చే టీకాలను ఉదయం పూటే అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. అనంతరం రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్‌లు కావ్య, సామ్రాట్ యాదవ్, హెచ్‌ఈవో వెంకటేశ్వర్ రావు, సూపర్‌వైజర్లు కిషన్, ప్రభాకర్, సిబ్బంది ప్రేమలత, తదితరులున్నారు.

వీరాపూర్ దుబ్బాలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

బీర్కూర్, మే6: మండలంలోని వీరాపూర్ దుబ్బాలోసోమవారం ఎంపీపీ రఘు ముఖ్యకార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజారిటీ అందించాలన్నారు. మాజీ మంత్రి, మాజీ సభాపతి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సందీప్ పటేల్, పట్టణ అధ్యక్షులు దుంపల రాజు, సీనియర్ నాయకులు ఆవారి గంగారాం, ప్రధాన కార్యదర్శి కొరిమే రఘు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వీరాపూర్ దుబ్బాలో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎంపీపీ

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

- దర్శన్ - మనజుమిల్ బాయ్స్
- శాంతి - టిల్లు స్క్వేర్
- ప్రియా 70 - ది ఫ్యామిలీ స్టార్
- ప్రియా 35 - గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ

- మహేశ్వరి - ఆ ఒక్కటి అడక్కు
- వెంకటేశ్వర - ప్రసన్నవదనం

చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	150	220	250
వెన్‌కాబ్(కిలో)	:	160	230	260